క్లుప్తంగా

గ్రీన్ ఫెస్టివల్



ప్లాస్టిక్ రహిత గ్రీన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ముత్యాలమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ రహిత గ్రీన్ ఫెస్టివల్ ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పీవీవీడీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి ప్లాస్టిక్ వాడరాదని, నగరంలోని అన్ని దేవాలయాలను ప్లాస్టిక్ రహిత దేవాలయాలుగా ప్రకటించామన్నారు. దేవాలయాలకు వెళ్లే భక్తులు ఎవరు ప్లాస్టిక్‌ని తీసుకెళ్లరాదని, తద్వారా ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ శ్రీకాకుళం సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి సూచించారు. మండలంలోని గంగన్నదొరపాలెం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్య కవిత్వ పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పద్య కవిత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు తంగి ఎర్రమ్మ, పొట్నూరు మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెలుగు భాష అభివృద్ధి అనే అంశంపై ఆన్‌లైన్‌లో పోటీలు జరుగుతాయన్నారు. స్వీయ రచనా హామీ పత్రం జత చేయాలని సూచించారు. గెలిచిన వారికి జ్ఞాపిక, గుర్తింపు పత్రం అందజేస్తామన్నారు. కవితలను 98665 24822 నంబర్‌కు అక్టోబరు 10లోగా పంపించాలని కోరారు.

పశువులు పట్టివేత

ఎచ్చెర్ల: మండలంలోని నవభారత్ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఏడు ఎద్దులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎచ్చెర్ల ఎస్‌ఐ సందీప్ కుమార్ తెలియజేశారు. నరసన్నపేట సంత నుంచి తుని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బోటనీ అధ్యాపకురాలు ఎస్.రుద్రమరాణి సూచించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్.చిన్నారావు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు 'ఎకో ఫ్రెండ్లీ మోడల్స్' ప్రిపేర్ చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో–ఆర్డినేటర్ కె.మౌనిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అన్నదానం మహాదానమని లయన్ డా.పైడి సింధూర అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలోని గొంటివీధిలో ఉన్న నైట్ షెల్టర్‌లోని పేదలకు అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన ఎన్ని నాగేశ్వరరావు, జయలక్ష్మి దంపతులు, కుమారుడు ఎన్ని శ్రీకాంత్‌లు నిస్సహాయకులకు అన్నప్రసాదాన్ని అందించారన్నారు. అనంతరం వృద్ధుల ఆరోగ్య సమస్యలపై ఆరాతీసి మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరుణించు మా తల్లి.. కనక దుర్గమ్మ



ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గార: అంబటివానిపేటలో సామూహిక కుంకుమార్చనలు



జిసిగడాం: పెంట గ్రామంలో కుంకుమ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: అన్నపూర్ణగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: చండీమాతగా రాజరాజేశ్వరీ



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో మహాలక్ష్మిగా దర్శనం



శ్రీకాకుళం కల్చరల్: తుల్జాభవానీ అమ్మవారికి అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: ఉమాదేవికి పుష్పాలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో సామూహిక కుంకుమ పూజలు



గార: దుర్గాలయంలో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళా భక్తులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల: ప్రత్యేక అలంకణలో రాజరాజేశ్వరీ అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: పెద్దపాడు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నవదుర్గామాతలు



శ్రీకాకుళం కల్చరల్: బలగలో సామూహిక సుహాసినీ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో సామూహిక పూజలు



ఎచ్చెర్ల: కొయ్యాంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



గార: శ్రీకూర్మంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిన్నారావు



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో హిస్టరీ, టూరిజం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ సమాజంలో పర్యాటకం ప్రాముఖ్యత తెలియజేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో అరసవల్లి, పాండవుల మెట్ట, తేలినీలాపురం, శ్రీకూర్మం, శాలిహుండాం, శ్రీముఖలింగం, మందస, సంగాం తదితర ఎన్నో టూరిజం ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడుతూ పర్యాటకంతో ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత ప్రయోజనాలు, ఉద్యోగాలను సృష్టించడం జరుగుతుందన్నారు.

అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.రామజోగినాయుడు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో–ఆర్డినేటర్ కె.మౌనిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన చిక్కోలు కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ గురువు చింతాడ రవిబాలకృష్ణ ఆధ్వర్యంలో 11 మంది విద్యార్థులు కేరళలోని పలు ప్రాంతాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తున్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనల్లో భాగంగా గురువారం ఎర్నాకులంలో (కొచ్చి) టీడీఎం వంద సంవత్సరాల వేడుకలో నృత్య ప్రదర్శనలు చేపట్టి ఆకట్టుకున్నారు.



సత్కారం పొందుతున్న కళాకారులు

అధికారుల నిర్లక్ష్యంతోనే అన్యాయం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ప్రభాకర్ తదితరులు

గార: గిరిజన సంక్షేమ శాఖాధికారుల నిర్లక్ష్యంతో కుల ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని, ఎరుకుల సంబంధిత కులస్తులకు న్యాయం దక్కలేదని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఒలిగి ప్రభాకర్ ఆరోపించారు. మండలంలోని సతివాడ, తంగుళ్లపేట, మొగదాలపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం గార తహసీల్దార్ ఎం.చక్రవర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎరుకుల కులస్తులు 4,500 కుటుంబాలున్నాయని, గార మండలంలో ఉన్న ఎర్రగొల్లలకు 2004 వరకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేసి తర్వాత నిలిపేశారన్నారు. ఇప్పటివరకు ఎటువంటి కులం ధ్రువీకరించకపోవడం రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కాలరాయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన శాఖాధికారులు స్పందించి సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉన్నా ఎటువంటి చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైచర్ల దుర్గారావు, పసుపురెడ్డి లక్ష్మణమ్మ, బండి రాము, పసుపురెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణవి దిగజారుడు మాటలు



గార: సినీ నటుడు నందమూరి బాలకృష్ణవి దిగజారుడు మాటలని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ సినీ రంగం ఇబ్బందులపై చిరంజీవిని ఎంతో గౌరవించి, స్పందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు మాటలు సరికాదన్నారు. అసెంబ్లీలో తూలిన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని మాటలు



మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తిలా హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాటలు ఉన్నాయని, అసెంబ్లీలో ఆయన అబద్ధాలను నటుడు చిరంజీవి ఖండించడం ప్రజలంతా స్వాగతిస్తున్నారని జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మార్పు దుర్గాపృథ్వీరాజ్ అన్నారు. ప్రజలకు ఆదర్శవంతంగా ఉండాల్సిన నటుడి అసభ్యకరమైన మాటలు తీవ్ర అభ్యంతకరమన్నారు. కూటమి నాయకులు స్పందించాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ అలపాన త్రినాథరెడ్డి అన్నారు. మెంటల్ సర్టిఫికెట్‌తో ఉన్నటువంటి అతడు ఎమ్మెల్యేగా అనర్హుడని పేర్కొన్నారు. ఆయన తన మాటలను వెనక్కి తీసుకోవాలని సూచించారు.

హామీలు అమలు చేయకుండా సంబరాలా..?

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సూపర్ హిట్ పేరుతో సంబరాలు చేసుకోవడం ఏంటని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. హామీల్లో ముఖ్యమైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం ఎక్కడని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో భయపెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో హామీలు అమలు చేయాలని కోరారు.



పొన్నాడ రుషి

మతాలతో రాజకీయాలు చేస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైమ్: మతాలతో రాజకీయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రైస్తవ సమాజంలో పాస్టర్లు విశ్వాసాన్ని కాపాడుకోవాలని శ్రీకాకుళం సబ్ డివిజనల్ అధికారి (డీఎస్పీ) సీహెచ్ వివేకానంద స్పష్టం చేశారు. ఇటీవల నగరంలోని క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సమాధులను నేలమట్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ఫెలోషిప్ కమిటీ సభ్యులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీవో సాయిప్రత్యూష, తహసీల్దారు పేర్ల గణపతిరావులతో పాటు డీఎస్పీ వివేకానంద గ్రౌండ్‌ను పరిశీలించి రెండు వర్గాలుగా ఉన్న కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాధుల బాధిత కుటుంబ సభ్యులను పిలిపించి వారి కుటుంబ సభ్యుల సమాధులను గుర్తించి ఇవ్వాల్సిన బాధ్యత కమిటీలదేనన్నారు. అధికారులతో పాటు జిల్లా క్రైస్తవ సంక్షేమ మైనార్టీ కమిటీ సభ్యుడు డీబీడీబీ కుమార్, రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.



కమిటీ సభ్యులతో సమావేశమైన డీఎస్పీ వివేకానంద, ఆర్డీవో ప్రత్యూష తదితరులు

అప్రమత్తతే శ్రీరామ రక్ష



అల్లినగరం వద్ద మేత మేస్తున్న గొర్రెలు

- వర్షాకాలంలో ప్రాణాంతక వ్యాధులు
- మేకలు, గొర్రెల్లో కాలిపుండు ప్రమాదం

ఎచ్చెర్ల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు వ్యాధుల బారిన పడుతుండడంతో పాడి రైతులు అనేక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో ఒక్కసారిగా నీరు చేరి కలుషితమవుతుంటాయి. కలుషిత నీరు తీసుకోవడంతో పశువులకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదముందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో జీవాలు

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల మండలంలో 12,940 గొర్రెలు, 3,942 మేకలు ఉన్నాయి. జి.సిగడాం మండలంలో 18,420 గొర్రెలు, 2,940 మేకలు ఉన్నాయి. లావేరు మండలంలో 34,200 గొర్రెలు, 6000 మేకలు ఉన్నాయి. రణస్థలం మండలంలో 52,340 గొర్రెలు, 4,500 మేకలు ఉన్నాయి. మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షాకాలంలో తడవడం, మురికి కుంటల్లో నిల్వఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మజీవులు వాటి కాళ్లను ఆశించడంతో కాలిపుండు వ్యాధి బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీన్ని ముందుగా గుర్తించకుంటే జీవాలకు వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తమ సిబ్బందిని లేదా పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

కాలిపుండు వ్యాధి లక్షణాలు

కాలిపుండు సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకబడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టలు మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు, బరువు తగ్గుతాయి. గిట్టలు మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం సైతం ఉంటుంది. ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం (కాపర్ సల్ఫేట్) లేదా 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం, లేదా 10 శాతం పొటాషియం పర్మాంగనేట్ లేదా 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో నడిపించి వాటి కాళ్లను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేయడం ద్వారా ఫలితముంటుంది. వైద్యుల సూచనలు మేరకు యాంటీ బయాటిక్ మందులను దాదాపు నెల రోజుల వరకు పూత పూయాలి. అలాగే అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యులు సూచనలు మేరకు మందులు వేయాలి.

– డాక్టర్ కె.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

అధ్వానం



ఎచ్చెర్ల మండలంలోని ముద్దాడ గ్రామం నుంచి రుప్పపేట, సెగిడిపేట, అంబేడ్కర్‌నగర్ మీదుగా కొయ్యవానిపేట వరకు ఉన్న 4 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. సచివాలయానికి, బ్యాంక్‌కు, రేషన్ డిపోకు, వ్యవసాయ పనులకు, స్కూల్‌కి వెళ్లేందుకు ఈ ఒక్క మార్గమే ఈ గ్రామాలకు దిక్కు. దీంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు ప్రయాణాలకు నరకయాతన పడుతున్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఎచ్చెర్ల